www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 16 ఫిబ్రవరి 2024

5

అన్నమయ్య

నేడు జాతీయ గ్రామీణ సమ్మె

ప్రజాశక్తి-రాయచోటి : దేశవ్యాప్తంగా జరగబోయే గ్రామీణ భారత్ బంద్‌లో జిల్లా వ్యాప్తంగా ప్రతి పల్లెలో ఈ బంద్ ప్రభావం కనిపించేలా జయప్రదం చేయాలని, గ్రామీణ కష్టజీవులు ఈ బంద్‌లో పాల్గొని జయప్రదం చేయాలని వామపక్ష కార్మిక, రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు ప్రచారాలు నిర్వహించాయి. ఎక్కడిక్కడ ర్యాలీలు నిర్వహిస్తూ ప్రజలను బంద్‌లో పాల్గొనేలా చైతన్య వంతులను చేశాయి. జాతీయ సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ఆయా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ప్రతి కార్మికుడు, వారి కుటుంబానికి, రైతాంగానికి మోడీ విధానాలకు వ్యతిరేకంగా విస్తృతంగా ప్రచారం చేయాలిన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లో, మండల కేంద్రాల్లో గ్రామీణ భారత్ బంద్ జరపాలని కోరారు. నిత్యావసర సరుకులు, డీజిల్, పెట్రోల్ వంటగ్యాస్, రైతుకు ఎరువు రేట్లు పెంపు గిట్టుబాటు ధర లేదు రైతులను నిర్లక్ష్యం చేస్తున్న ఈ పార్టీలను రాబోయే ఎలక్షన్లలో ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని తెలిపారు. విభజన హామీల్లో పొందుపరిచిన విశాఖ ఉక్కు, ప్రత్యేక హోదా, కడప ఉక్కు కర్మాగారా ఫ్యాక్టరీని ఇంతవరకు నిర్మించకపోవడం వీళ్ళ బాధ్యత రహితానికి ఒక నిదర్శనమని, పోలవరం ప్రాజెక్టు నిధులు కేటాయించి నిర్మాణం పూర్తి చేయలేని వైసిపి ప్రభుత్వంతో పాటు చేతకాని ప్రభుత్వాలకు గ్రామీణ ప్రజలను ఓట్లు అడిగే హక్కు ఈ పార్టీలకు లేవని విమర్శించారు.

నోడల్ అధికారుల పాత్ర కీలకం : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

2024 సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో నోడల్ అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు, ఎన్నికల సమయంలో చేపట్టా ల్సిన వివిధ కార్యకలాపాలను సమర్ధవంతంగా పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించామన్నారు. త్వరలో వచ్చే సాధారణ ఎన్నికలను ఎలాంటి అవాంతరాలు లేకుండ నిష్పక్షపాతంగా నిర్వహించడానికి ఆయా అంశాలలో నోడల్ అధికారులకు విధులను కేటాయించడం జరిగిందని బాధ్యతాయుతంగా విధులను నిర్వహించి ఎన్నికలను విజయవంతం చేయాలన్నారు. అధికారులందరూ ఎన్నికల సంఘం జారీ చేసే సూచనలకు అనుగుణంగా 2024 శాసనసభ, పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎప్పటికప్పుడు జిల్లా ఎన్నికల అధికారి ద్వారా కేటాయించబడిన విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించాలన్నారు. అధికారులందరూ ఎన్నికల సమయంలో సందర్భానుసారం నిర్వర్తించాల్సిన విధులు, చేపట్టాల్సిన పనులు, ప్రక్రియలకు సంబంధించి ఎన్నికల సంఘం ద్వారా జారీ చేయబడిన మాన్యువల్లు, హ్యాండ్‌బుక్‌లు, సర్క్యులర్‌లను క్షుణ?ంగా చదివి అవగాహన కలిగించుకోవాలన్నారు. ఎన్నికల నియమాలు, విధానాలతో ఇప్పటి నుంచే తమను తాము సన్నద్ధం చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల నిబంధనలకు సంబంధించిన బుక్‌లెట్‌లను ఈసిఐ వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ఏర్పాట్లను ఎటువంటి ఇబ్బంది లేకుండా, నిష్పక్షపాతంగా చేయడానికి నియోజకవర్గ ఇఆర్‌ఒలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని కోరారు. నియమించబడిన నోడల్ అధికారులందరూ వారికి కేటాయించిన సబ్జెక్టుకు సంబంధించిన ఫైళ్లను ఎప్పటికప్పుడు సమర్పించాలని తెలియజేశారు. నోడల్ అధికారులందరినీ జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి పర్యవేక్షిస్తారని, ఎన్నికల సంబంధిత కార్యకలాపాల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఎన్నికల విధులలో నిర్లక్ష్యం వహించడం, బాధ్యతారహితంగా ప్రవర్తిస్తే చాలా తీవ్రంగా పరిగణించబడుతుందని, అమలులో ఉన్న ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం తప్పు చేసిన అధికారులపై చర్య తీసుకోబడుతుందన్నారు. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత షెడ్యూల్ ప్రకారం ప్రణాళిక బద్ధంగా పనిచేసే ఎన్నికలను విజయవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అడిషనల్ ఎస్‌పి రాజ్‌కమల్, డిఆర్‌ఒ సత్యనారాయణ రావు, నియోజకవర్గ ఇఆర్‌ఒలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే సమాజాభివృద్ధి : జెవివి

ప్రజాశక్తి-రాయచోటి

శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకుని, సృజనాత్మకతను పెంపొందించుకుని మూఢనమ్మకాలను విడనాడాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు మురళీధర్ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సైన్స్ కళాజాతా గురువారం రాయచోటికి చేరుకుంది. స్థానిక శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాలలో విజ్ఞాన, వినోద, మ్యాజిక్ కళా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. శ్రీకాకుళం నుంచి మొదలైన ఈ కార్యక్రమం అనంతపురం జిల్లాలో పర్యటించే వరకు కొనసాగుతుందని తెలిపారు. సైన్స్‌తోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. శాస్త్ర, సాంకేతికత విజ్ఞానాన్ని భవిష్యత్ తరానికి అందించినప్పుడే దేశం అన్నిరంగాల్లో ముందడుగు వేస్తుందని తెలిపారు. మూఢనమ్మకాల పంజరాల్లో చిక్కుకున్న ప్రజలను విజ్ఞాన రంగాల వైపు మళ్లించేలా యువత ముందుకు రావాలని కోరారు. మూఢనమ్మకాలను సమాజం నుంచి దూరం చేయాలని పిలుపునిచ్చారు. ఈ యాత్రలో 25 మంది కళాకారులు పాల్గొంటున్నారని వారి చేత సైన్స్ నాటికలు, సైన్స్ పాటలు, మ్యాజిక్ షో, సైన్స్ ప్రయోగాలు మొదలైన అంశాలు ప్రదర్శించామని తెలిపారు. నవతరానికి తగ్గట్టు పాటలు రూపొందించామని తెలిపారు. శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ప్రజల్లో మూఢనమ్మకాలను తొలగించడానికి తీవ్రంగా కృషి చేస్తున్నందుకు వారిని అభినందించారు. విజ్ఞాన శాస్త్రం అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. విజ్ఞాన శాస్త్రం కోసం ఎందరో శాస్త్రవేత్తలు ప్రాణాలర్పించారు. సైన్స్ మనిషి జీవితానికి ఒక దిక్సూచి అని అన్నారు. మానవత రాష్ట్ర కమిటీ నాయకులు సహదేవరెడ్డి మాట్లాడుతూ

సమావేశంలో మాట్లాడుతున్న లయన్ హరినాథరెడ్డి

విద్యార్థులకు ఆటపాటల ద్వారా విజ్ఞానాన్ని కలిగించేందుకు జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషిని అభినందించారు. జిల్లా సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వివిధ కృత్యాల ద్వారా పాఠ్యాంశాలను అవగాహన పెంచుకునేందుకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో త్రిమూర్తులురెడ్డి, మానవత కమిటీ సభ్యులు సహదేవరెడ్డి, లయన్ హరినాథరెడ్డి, పాఠశాల అధ్యాపక బృందం, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు ప్రభుచరణ్, ఆంజనేయులు, నాగశేషారెడ్డి, వినయ్ కుమార్, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, ప్రజానాట్య మండలి సభ్యులు పాల్గొన్నారు. జాతాలో కళా బృందాలు మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా చైతన్యం కల్పించేలా నాటికలు, గీతాలతో కళారూపాలను ప్రదర్శించాయి.

ఎన్నికల బాండ్లపై సుప్రీం తీర్పు హర్షణీయం : సిపిఎం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ఎన్నికల బాండ్లను రాజ్యాంగ విరుద్ధంగా పేర్కొంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు పట్ల సిపిఎం అన్నమయ్య జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలలో దొంగడబ్బు, నల్లధనం విచ్చలవిడిగా ప్రవహిస్తున్నదని, అధికార పార్టీలకు, పెట్టుబడి దారులు వారి ప్రయోజనాలు ప్రోత్సాహించే అభ్యర్థుల కోసం ఈ డబ్బును వెదజల్లి ఓట్లు కొనుగోలు చేసి ప్రజా తీర్పును తలకిందులు చేస్తున్నారని విమర్శించారు. ఇదే నల్లడబ్బుతో ఓడిపోయిన పార్టీ ప్రతినిధులను కొనుగోలు చేసి ప్రభుత్వాలను సైతం తారుమారు చేస్తున్నాయని తెలిపారు. ఇటువంటి నేపథ్యంలో సుప్రీం కోర్టు తీర్పు చాలా ప్రత్యేకతను సంతరించుకుందన్నారు. ఎన్నికల బాండ్లకు వ్యతిరేకంగా కోర్టులో సిపిఎం కూడా పిటిషన్ దాఖలు చేసిందని గుర్తుచేశారు. ఎన్నికల ప్రక్రియలో, ఎన్నికల ఖర్చులో పారదర్శకత ఉండాలని కోరుకున్న వారిలో సిపిఎం ముందు వరసలో ఉందని వివరించారు. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ఎన్నికల బాండ్లను పూర్తిగా నిషేధించాలని డిమాండ్ చేశారు. ఏ కంపెనీ అయినా, ఏ వ్యక్తైనా ఎవరికి ఎంత డబ్బు ఇస్తున్నాడో, ఆ పార్టీ ఎంత ఖర్చు పెడుతుందో లెక్క ఉంటేనే నల్లధనం ప్రవాహాన్ని అడ్డుకోగలమని వివరించారు. అధికార పార్టీ ప్రత్యేకించి మోడీ ప్రభుత్వం ప్రత్యర్థి పార్టీలపైకి ఇడి, ఐటి వంటి సంస్థలను ప్రయోగించి వారి దగ్గరున్న డబ్బును లాక్కోవడం, తమ పార్టీ అభ్యర్థులు పెట్టే ఖర్చులపై ఎలాంటి ఆంక్షలు లేకుండా స్వేచ్ఛగా వదిలేయడం జరుగుతోందని పేర్కొన్నారు. అన్ని పార్టీలకు ఎన్నికల్లో ఖర్చు పెట్టేదానికి ఒకే విధమైన విధివిధానాలు ఉంటే ఎన్నికల సంస్కరణల్లో ఒక ముఖ్యభాగం పూర్తవుతుందని తెలిపారు. ఆ దిశగా సుప్రీంకోర్టు కూడా చొరవ తీసుకుని నియమ నిబంధనలు రూపొందించాలని కోరారు. ఎన్నికలలో ఖర్చులలో పారదర్శకత లోపించడం వల్ల శత కోటీశ్వరులు ఎంపీలు, ప్రజా ప్రతినిధులై వారికి అనుకూలమైన చట్టాలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజల ప్రయోజనాలను గాలికి వదిలేస్తున్నారని విమర్శించారు. ఎన్నికలలో దొంగడబ్బును అరికట్టగలిగితే ఎన్నికల వ్యవస్థను ఒక క్రమపద్ధతిలోకి తీసుకురావచ్చని తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పును సిపిఎం స్వాగతిస్తోందని వివరించారు.

వాలంటీర్లే సంక్షేమ పథకాల వారధులు : కలెక్టర్

వాలంటీర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా వాలంటీర్లు అందిస్తున్న సేవలు అమోఘమని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం వాలంటీర్లకు పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ, వార్డు వాలంటీర్ల సేవలకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరుసగా నాల్గవ ఏడాది వాలంటీర్లను ప్రోత్సహించేందుకు అవార్డులు ఇస్తున్నామన్నారు. నియోజకవర్గ పరిధిలో 1630 మంది వాలంటీర్లకు గాను సేవావజ్ర 5, సేవారత్న 35, సేవామిత్ర 1590 మంది చొప్పున వాలంటీర్లకు పురస్కారాలు ప్రదానం చేశామని పేర్కొన్నారు. వాలంటీర్ల ఉద్యోగం ఎంతో బాధ్యత గలదని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని చెప్పారు. గతంలో ప్రజలు ఒక ఇంటి పట్టా పొందాలంటే కార్యాలయాల చుట్టూ తిరిగే వారిని నేడు వాలంటీర్లు ఇంటింటికి వచ్చి ప్రభుత్వ పథకాలను పేదల ముంగిటకు చేర్చుతున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం, ప్రతి కార్యక్రమం వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు చేరువ చేస్తూ రాష్ట్రంలో బెస్ట్ అడ్మినిస్ట్రేషన్ అమలవుతోందన్నారు. ప్రజలు తమ సమయాన్ని వృథా చేసుకోకుండా వాలంటీర్లకు ఒక ఫోన్ చేస్తే వారు ఇంటి దగ్గరకు వచ్చి అప్లికేషన్స్ తీసుకెళ్లి అప్పటికప్పుడే సమస్యలు పరిష్కరిస్తారన్నారు. నేడు ప్రజలు వాలంటీర్లపై ఎంతో నమ్మకం పెంచుకున్నారని ఈ నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాబోయే రోజులలో వాలంటీర్లు మరింత బాగా పని చేసి ప్రజలకు చేరువ కావాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు ఆసీఫ్ అలీ ఖాన్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, మున్సిపల్ ఆర్‌ఐ మల్లికార్జున పాల్గొన్నారు. సేవా వజ్ర నగదు పురస్కారం పొందిన 28 మందికి సర్టిఫికేట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్, రూ.45 వేల నగదు బహుమతి ప్రదానం చేశారు. సేవా రత్న నగదు పురస్కారం పొందిన 165 మందికి సర్టిఫికేట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్, రూ.30 వేల నగదు, సేవా మిత్ర నగదు పురస్కారం పొందిన 8174 మందికి సర్టిఫికేట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్, రూ.10 వేల నగదు బహుమతి ప్రదానం చేశారు.

మాయాప్ సంస్థపై పోలీసులకు బాధితుల ఫిర్యాదు

సిఐ తులసీరామ్‌కు ఫిర్యాదు చేస్తున్న మాయాప్ బాధితులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

బలహీనతను అవకాశంగా మలుచుకొని యాప్‌ల పేరుతో సైబర్ నేరస్తులు అమాయకులను దోచేస్తున్నారు. ప్రజల్లో ఉన్న ఆశను అవకాశంగా మార్చుకొని రూ.కోట్లల్లో నగదు దోచుకుంటున్నారు. మాయాప్‌లో పెట్టుబడులు పెట్టండి మీ సొమ్ము కొన్ని రోజుల్లోనే రెట్టింపు అవుతుందని నమ్మించారు. బాధితులు రూ.కోట్లు పెట్టిన వెంటనే బోర్డు తిప్పేశారు. తాజాగా అన్నమయ్య జిల్లాలోని సుండుపల్లి మండలంలో వెలుగు చూసిన ఘటననే ఇందుకు నిదర్శనం. గురువారం ఎస్‌టిఐసి అనే యాప్ పనిచేయకపోవడంతో బాధితులు రాయచోటి రూరల్ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ సుండుపల్లి కేంద్రంగా ఎస్‌టిఐసి యాప్ పేరుతో సైమన్ అనే వ్యక్తి కార్యాలయం ఓపెన్ చేసి అమాయకులను నమ్మబలికి కార్యకలాపాలు సాగించి బోర్డు తిప్పేసారని పేర్కొన్నారు. సైమన్ అనే వ్యక్తి గతంలో సస్పెన్షన్‌కు గురైన ఎఆర్ కానిస్టేబుల్ సోదరుడని తెలిపారు. మోసపోయామని గ్రహించి తమకు న్యాయం చేయాలంటూ ఎస్‌పి కార్యాలయానికి 30 మంది బాధితులు ఫిర్యాదు చేయడానికి రావడంతో రూరల్ సిఐ తులసీరామ్‌కు అప్పగించారు. నాయ్యం కోసం బాధితులు రాయచోటి రూరల్ పోలీసు స్టేషన్‌కు క్యూ కట్టారు. అన్నమయ్య జిల్లాతో పాటు తిరుపతి, చిత్తూరు, సత్యసాయి, అనంతపురం జిల్లాలకు చెంది బాధితులు ఉన్నారని రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 20 వేల మందికి పైగా బాధితులు ఉంటారని బాధితులు అంటున్నారు. ప్రయివేట్ యాప్‌ల పేరుతో కేటుగాళ్లు ప్రజలను లూటీ చేస్తున్నరని రెట్టింపు సొమ్ము వస్తుందని ఆశ చూపి రూ.కోట్లు స్వాహా అవుతాయని సిఐ తెలిపారు. యాప్ మాయగాలను నమ్మి ప్రజలు ఎవరు మోసపోకూడదన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మలిశెట్టి వెంకటరమణ

వైసిపి పాలనలో రాజారెడ్డి రాజ్యాంగం : 'మలిశెట్టి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వైసిపి పాలనలో ఆంధ్ర రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తోందని జనసేన పార్టీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి తమ అధినేత పవన్ కల్యాణ్ భీమవరం పర్యటనకు సెల్ టవర్ సాకు చూపి పర్యటనను అడ్డుకోవడం హేయమైన చర్యన్నారు. జగన్‌కుగానీ, వైసిపి మంత్రులకు గాని ఏనాడు సెల్ టవర్లు అడ్డు రాలేదా అని ప్రశ్నించారు. అధికార పార్టీకి ఒక న్యాయం, ప్రతిపక్షాలకు మరొక న్యాయమా అని మండిపడ్డారు. టిడిపి, జనసేన కూటమికి ప్రజలలో ఉన్న ఆదరణ చూసి ఓటమి భయంతోనే తమ నాయకుడి పర్యటనలను అడ్డుకుంటున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికలలో అత్యధిక మెజారిటీతో గెలుపొంది తాము అధికారంలోకి వస్తామని, దౌర్జన్య, నిరంకుశ పాలన నుంచి ప్రజలకు విముక్తి కల్పిస్తామని పేర్కొన్నారు.

'ఎన్నికల్లో పోటీ చేసే నైతిక హక్కు కోల్పోయిన జగన్'

ప్రజాశక్తి-పీలేరు : ఎన్నికల్లో పోటీ చేసే నైతిక హక్కు జగన్మోహన్‌రెడ్డి కోల్పోయారని జనసేన నియోజకవర్గం బాధ్యులు బెజవాడ దినేష్ తెలిపారు. గురువారం కెవి పల్లి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో జగన్ అనేక బూటకపు హామీలు ఇచ్చారని, వాటిలో ఒకటి, రెండు మినహా ఇంకెన్నో హామీలు ఆచరణకు నోచుకోలేదన్నారు. తాను ఇచ్చిన ముఖ్యమైన హామీల్లో సంపూర్ణ మద్యపాన నిషేధం ఒకటని, అది అమలు చేశాకే ప్రజలను ఓట్లు అడుగుతా, లేదంటే ఓట్లు అడగనని చెప్పిన ముఖ్యమంత్రి కనీసం ఇప్పుడైనా మహిళలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. లేదా చెప్పిన మాట ప్రకారం 2024 ఎన్నికల్లో పోటీ నుంచి స్వచ్ఛందంగా తప్పుకోవాలని డిమాండ్ చేశారు. ఓట్లు అడగడానికి ఇండ్ల ముందుకు వచ్చే వైసిపి నాయకులను పీలేరు నియోజకవర్గంలోని ప్రతి మహిళా నిలదీయాలని పిలుపునిచ్చారు. మద్యపాన నిషేధం చేస్తానని ఇప్పుడు సొంత బ్రాండ్లు అమ్ముకుంటూ మద్యంపైన డబ్బు సంపాదించుకుంటున్న జగన్ ఎన్నికల్లో పోటీ చేసే హక్కు కోల్పోయారని తెలియజేశారు. కార్యక్రమంలో కెవి పల్లి మండల అధ్యక్షులు మహేష్, సీనియర్ నాయకులు రెడ్డెప్ప, కలికిరి, వాల్మీకిపురం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అస్లాం, ప్రభాకర్, పీలేరు మండల ప్రధాన కార్యదర్శి పవన్, గౌస్ బాష, కిశోర్, నాయకులు మొలక చిరంజీవి, ఎం.అశోక్, టి.గురుమూర్తి, పి.రమణ, సాయికుమార్, నవీన్. టి.విశ్వనాథ్, బావాజీ పాల్గొన్నారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి

ప్రజాశక్తి-మదనపల్లి: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని వైసిపి నియోజకవర్గ సమన్వయ కర్త నిస్సార్ అహ్మద్ అన్నారు. గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజల కోసం కల్పిస్తున్న ఈ సౌకర్యం వల్ల ఎంతో మందికి చాలా ఉపయోగకరమైనదని పేర్కొన్నారు. ఎపిఎండిసి చైర్‌పర్సన్ షమీం అస్లాం మాట్లాడుతూ ప్రజల కోసం ఆరోగ్యశ్రీని అన్ని రకాల వ్యాధుల నుండి కాపాడుకునేందుకు సౌకర్యాలు కల్పించిన సిఎం జగన్‌ను ప్రజలు మరచిపోలేరన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తట్టి శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు భాను ప్రకాష్, శివారెడ్డి రహీం, ఎస్వీ రమణ, ఖాజా, వైసిపి నాయకులు నరేంద్ర, సలీమ్, నగరాజరెడ్డి పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న నిస్సార్ అహమ్మద్

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్

విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయాలి

ప్రజాశక్తి-మదనపల్లి

విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ అన్నారు. గురువారం కళాశాలలో ఇన్‌స్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్, నేషనల్ ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ పాలసీ సెల్ వారు సంయుక్తముగా వారం రోజుల పాటు పరివర్తన ఆలోచనలు, ఇంక్యుబేషన్ ఎక్సలెన్స్ అను అంశంపై బూట్‌క్యాంప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వలసపల్లెలోని జవహర్ నవోదయ విద్యాలయం, డాక్టర్ బిఆర్. అంబేద్కర్ గురుకులం, బురకాయలకోట, వాల్మీకిపురం నుంచి 120 మంది విద్యార్థులు, 9 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. యువరాజ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భారతదేశంలో ఒక మిలియన్ మంది పిల్లలను నియోటెరిక్ ఇన్నోవేటర్‌లుగా తీర్చిదిద్దే లక్ష్యంతో అటల్ ఇన్నోవేషన్ మిషన్ భారతదేశంలోని పాఠశాలల్లో అటల్ టింకరింగ్ లాబొరేటరీలను ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ వినూత్న కార్యక్రమానికి తమ కళాశాల ప్రాతినిధ్యం వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, పిఇటిలు సి.సుబాషిణి, డాక్టర్ ఎం.కల్పన, బి.గోవింద్ రావు, పి.జగదీష్ కుమార్, జి.సుమతి, కె.శ్రీనివాస మూర్తి, డాక్టర్ కె.అరుల్ కుమార్, యు.విజయ లక్ష్మి, డా. ఎస్. గోపాలకృష్ణన్. యూనివర్సిటీ ఇన్నోవేషన్ ఫెలోల సహాయంతో మిట్స్ డిజైన్ థింకింగ్ టెక్నిక్స్ మరియు ఇన్నోవేటివ్ సొల్యూషన్స్‌ను విద్యార్థులకు వివరించారు.

టిడిపి నాయకులతో నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి

టిడిపి గెలుపే లక్ష్యంగా పనిచేయండి : 'నల్లారి'

ప్రజాశక్తి-మదనపల్లి

టిడిపి, జనసేన గెలుపే లక్ష్యంగా పనిచేయాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మదనపల్లెకు వచ్చిన ఆయన స్థానిక టిడిపి, జనసేన నేతలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పేర్కొన్నారు. వైసిపి ఎత్తులను చిత్తు చేసేలా ప్రజలకు అరాచక పాలన గురించి వివరించాలన్నారు. ప్రతి పల్లెలోనూ ప్రజలకు ప్రభుత్వ వైఫల్యాలను తెలియజేయాలని తెలిపారు. టిడిపి, జనసేన అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని సూచించారు. జనసేన రాష్ట్ర కో-కన్వీనర్ గంగార పురాందాస్ చౌదరి మాట్లాడుతూ దొంగ ఓట్లతో గద్దెనెక్కాలని వైసిపి చూస్తోం దని చెప్పారు. జనసేన, టిడిపి కార్యకర్తలు, నాయకులు దొంగఓట్ల పైన ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. నల్లారిని కలిసిన వారిలో మదనపల్లి టిడిపి నేత యాలగిరి దొరస్వామి నాయుడు, నాదేళ్ల విద్యాసాగర్, బాలుస్వామి, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-పీలేరు

కిడ్నీ సమస్యతో బాధపడుతూ డయాలసిస్ చేసుకుంటున్న జనసేన నాయకుడు హరి కుటుంబానికి జిల్లా కార్యదర్శి కలప రవి సాయం అందించారు. గురువారం పీలేరు మండలం, చెరువు ముందపల్లికి చెందిన బాధితుడిని ఆయన పరామర్శించి, ఆ కుటుంబానికి 50 కిలోల బియ్యం, నెలకి సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. ప్రతి నెలా అందిస్తామని కూడా వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదే గ్రామంలో ప్రమాదవశాత్తు చేయి కోల్పోయిన కుమార్‌కు కూడా అండగా ఉంటామని, ప్రభుత్వ పరంగా అతనికి పింఛన్ అందేలా కృషి చేస్తామని తెలియజేశారు. గ్రామంలో అన్యాక్రాంతమైన దళితుల అసైన్డ్ భూములని జనసేన, తెలుగుదేశం ఉమ్మడి ప్రభుత్వం రాగానే హక్కు దారులకు పట్టాలు అందించేలా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కలప రవి, మండల అధ్యక్షులు వల్లెపు మోహన్ కృష్ణ, ఉపాధ్యక్షులు గురు మోహన్, ప్రధాన కార్యదర్శి గజేంద్ర, కార్యదర్శి నవీన్, హరీష్, కాపు యువసేన అధ్యక్షులు అండే సురేష్, జనసైనికులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న జనసేన నాయకుడు రవి

ప్రజలే ప్రచార సారధులు : 'ఆకేపాటి'

మాట్లాడుతున్న జడ్‌పి చైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వైసిపి ప్రభుత్వంలో వివిధ సంక్షేమ పథకాలు లబ్ధి పొందిన ప్రజలే స్టార్ క్యాంపెయినర్లని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం నూనెవారిపల్లిలోని ఆకేపాటి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఈ ఐదేళ్లలో వంద శాతం అమలు చేశారని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో నవరత్నాలు పథకాలు అమలు చేసి దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అభివృద్ధి లేదని ప్రతిపక్షం నోరుపారేసుకుంటోందని, నాడు-నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి, ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య విధానంలో అభివృద్ధి, ఆరోగ్యశ్రీ రూ.25 లక్షలకు పెంపు, సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటిలోనూ వెలుగులు నింపారని, ఇది అభివృద్ధి కాదా అని సూటిగా ప్రశ్నించారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలపై సిఎంకు ఎనలేని మమకారం ఉందని తెలిపారు. ఆ మమకారంతోనే బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం నిత్యం పరితపిస్తుంటారన్నారు. ఎల్లో మీడియా పనికట్టుకొని వైసిపి ప్రభుత్వంపై విషప్రచారం చేస్తోందన్నారు. చంద్రబాబు నాయుడు తన అధికారంలో ఏ ఒక్క సంక్షేమం తీసుకొచ్చి రాష్ట్రానికి ఏం చేశారని ఎన్నికలలో ప్రజల వెళతారని ప్రశ్నించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే తిరిగి జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. వైసిపి రాజంపేట నియోజకవర్గం అభ్యర్థిగా తనను ప్రకటించినందుకు ధన్యవాదాలు తెలుపుతూ తనతోపాటు పార్లమెంటు అభ్యర్థి మిథున్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, తిరిగి రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలని తెలిపారు. శుక్రవారం నుంచి ప్రచారం ప్రారంభిస్తానని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులు కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, విశ్వనాథరెడ్డి, ఈశ్వరయ్య, పృధ్వీపతిరెడ్డి, శామీర్ భాష పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

నాణ్యత ప్రమాణాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

విద్యార్థి దశ నుంచే వస్తువుల నాణ్యత ప్రమాణాలపై అందరూ అవగాహన పెంచుకోవాలని జడ్పిహైస్కూల్ (తెలుగు) పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.అంజాద్ అలీఖాన్ అన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (భారతీయ ప్రమాణాల సంస్థ) విజయవాడ శాఖ వారి ఆధ్వర్యంలో గురువారం స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో స్టాండర్డ్స్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మనం కొనుగోలు చేసే ప్రతి వస్తువు, ఆహార పదార్థాలను ఎలా ఎంపిక చేసుకోవాలో, అందులో ఉన్న నాణ్యత ప్రమాణాల గురించి తెలుసుకోవడానికి ఈ స్టాండర్డ్స్ క్లబ్ ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థులకు భారత ఆర్థిక వ్యవస్థలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రాముఖ్యత గురించి వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు నగదు, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందించారు. వ్యాసరచన పోటీలలో ప్రథమ బహుమతి సాధించిన మైథిలిరెడ్డికి రూ.1000లు, ద్వితీయ బహుమతి సాధించిన బి.హర్షితకు రూ.750లు, తృతీయ బహుమతి పొందిన శ్రావ్య కు రూ.500లు, ఎం.స్వాతి, ప్రజ్ఞా, చరిత, వాసవిలకు ప్రోత్సాహక బహుమతులుగా ఒక్కొక్కరికీ రూ.250లు చొప్పున అందించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ వస్తువులను కొనుగోలు చేసే సందర్భంలో వాట నాణ్యత ప్రమాణాలను గుర్తించాలని సూచిం చారు. కార్యక్రమంలో క్లబ్ మెంటర్ డాక్టర్ రాజేంద్రకుమార్, ఉపాధ్యా యులు సహదేవరెడ్డి, రమణప్ప, రెడ్డిశేఖర్, రవీంద్ర, సువార్తవాణి, వెంకట గోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

రత్నమ్మను సన్మానిస్తున్న ఎంఇఒలు, ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నత విలువలు కలిగినదని ఎంఇఒలు పద్మావతి, నారాయణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొమ్మిరెడ్డి గారిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న కె.రత్నమ్మను ఉపాధ్యాయ వృత్తిలో 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎంఇఒలు, స్థానిక ఉపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రత్నమ్మ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఉన్నత విలువలు కలిగినదని, 40 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ 40 సంవత్సరాలలో ఎంతోమంది విద్యార్థులకు విద్యా బోధనలను చేశానని అన్నారు. తన దగ్గర చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడినా, నేటికీ తనను గుర్తుపెట్టుకుని ప్రేమగా, గౌరవంగా పలకరిం చడం చాలా సంతోషంగా ఉంటుందని అన్నారు. ఎంఇఒలు మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిత్య విద్యా ర్థులని, ప్రతిరోజూ విద్యార్థులకు విద్యను బోధించడానికి తాను ముందుగా బోధించపోయే అంశాన్ని నేర్చుకొని విద్యార్థులకు అర్థవంతంగా బోధిస్తారిని తెలి పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.నాగేంద్ర కుమార్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సాయికిషోర్‌రెడ్డి

మండల అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల అభివృద్ధే తమ ధ్యేయమని ఎపి టూరిజం డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని చిన్న ఓరంపాడు పంచాయతీలో గురువారం రూ.19లక్షల వ్యయంతో త్యాగరాజకాలనీ, భద్రావతినగర్, అయ్యలరాజుపల్లి, బిసి కాలనీలో సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ మండలంలో ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకుని వస్తే ఉన్నతాధికారులు దృష్టి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. రాబోవు వేసవి కాలంలో మండలంలో తాగునీటి సమస్య లేకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో సిసిరోడ్డు, విద్యుత్, వీధిదీపాలు మెరుగుపడినప్పుడే గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని అన్నారు. రాబోవు ఎన్నికల్లో వైసిపికి మరో అవకాశం కల్పిస్తే అభివృద్ధి పథంలో నడిపించడానికి ముందుంటామని తెలపారు. కార్యక్రమంలో ఎంపిటిసి గోగడ దుర్గాప్రసాద్, ముక్కా రమేష్ కుమార్ రెడ్డి, చొప్ప గంగిరెడ్డి, ఎంపిటిసి కొత్త నరసింహులు, సర్పంచ్ ఆళ్లఈశ్వరయ్య, మాజీ ఎంపిపి రామకృష్ణయ్య, వార్డు మెంబర్ సుబ్బరాయుడు, దిలీప్ కుమార్‌రెడ్డి, నరేష్ కుమార్ రెడ్డి, డాక్టర్ ఉపేంద్ర, నాగేంద్ర పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా శ్రీనివాసులు బాధ్యతలు

ప్రజాశక్తి-రామాపురం

డిటి నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసులు

మండల తహశీల్దార్‌గా శ్రీనివాసులు గురువారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుంచి అన్నమయ్య కలెక్టరేట్‌కు బదిలీ అయ్యి కొంత కాలం పనిచేవారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా రామాపురం తహశీల్దార్‌గా నియమితులయ్యారు. ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా విధులు నిర్వహి స్తున్న డిటి అరవింద్‌కిషోర్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎల్లవేళలా మండల ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. రెవెన్యూ సిబ్బంది ఎన్నికల విధుల్లో అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

Document lost

వల్లెపు వెంకటేశ్ , విజయపురి కాలనీ, 4వలైన్, రాంపాలి ఆపార్టుమెంట్, జెకెసి కాలేజి రోడ్డు, గుంటూరు జిల్లా వాస్తవ్యుడనైన నేను ది.02-02-2024న అన్నమయ్య జిల్లా, తంబళ్ళపల్లి కు ప్రయాణించు చుండగ తంబళ్ళపల్లి బస్టాండ్ నందు గుంటూరు జిల్లా సబ్ రిజిష్టారు వారి ఆఫీసు నందు రిజిష్టరు కాబడిన డాక్యుమెంట్ నెం: 7613/2020 , ఆర్ అగ్రహారంలో 88చ.గ.లకు చెందిన డాక్యుమెంట్ పోయినది ఎంత వెదికిన దొరకలేదు. కావున ఎవరికైన దొరికిన యడల ఈ సెల్ ఫోన్‌కు 9177348485 కు తెలుపగలరు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కడప : విద్యార్థి దశ నుంచి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జేమ్స్ నేషనల్ హై స్కూల్ ప్రిన్సిపల్, కరస్పాండెంట్ పి. మజర్ అలీఖాన్, అన్నారు. జాతీయ రహదారి భద్రత ఉత్సవాలు సందర్భంగా గురువారం మజార్ అలీ ఖాన్ చేతుల మీదగా ట్రాఫిక్ నిబంధనల కరపత్రాలను పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆశయంగా పెట్టుకున్నారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం బి.కొత్తకోట పట్టణంలోని నగర పంచాయతీలో నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా చెక్కులు పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన సంస్కరణ వల్ల మహిళా సంఘాలు ప్రగతిపథంలో నడుస్తున్నాయని అన్నారు. గత టిడిపి ప్రభుత్వ పాలనలో నిర్వీర్య దశలో ఉన్న పొదుపు సంఘాలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు జీవం పోశాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో 18 శాతం సంఘాలు ఓవర్ డ్యూస్‌గా ఉంటే, ప్రస్తుతం 0.45 శాతానికి తగ్గాయని అన్నారు. బ్యాంకర్లు ఇచ్చే రుణాలపై వడ్డీశాతం తగించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని అన్నారు. ప్రముఖ కంపెనీల ఒప్పందాలతో ప్రతి అక్కచెల్లెమ్మలకు వ్యాపార మార్గాలు చూపుతున్నట్లు స్పష్టం చేశారు. మహిళలకు పదవుల్లో 50శాతం రిజర్వేషన్లు, మహిళల రక్షణకు దిశయాప్, మహిళల పేరుతో ఇళ్లస్థలాలు, పక్కాగృహాలు మంజూరు, పేదరిక నిర్మూలనకు ఆసరా, చేయూత, సున్నావడ్డీ పథకాల అమలుతో మహిళలకు మంచి జరుగుతోందన్నారు. మహిళా సాధికారత విషయంలో నేడు ఇతర రాష్ట్రాలు సైతం ఎపి వైపు చూస్తున్నాయని చెప్పారు. ఎన్ని ఇబ్బందులు వున్నా సంక్షేమ పథకాల అమల్లో ప్రభుత్వం రాజీ పడటం లేదన్నారు. నాల్గవ విడతలో బి.కొత్తకోట మండలానికి 999 మహిళా గ్రూపులకు రూ.11.37 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ పి.ఆర్ మనోహర్, తహశీల్దార్ పుణ్యవతి,నగర పంచాయతీ అకౌంట్ ఆఫీసర్ బి.రమాదేవి,విద్యుత్ శాఖ ఎఇ గిరిధర్, వైసిపి అన్నమయ్య జిల్లా మహిళా అధ్యక్షురాలు అనిత చక్రవర్తి, వైసిపి పట్టణ కన్వీనర్ సిఆర్ చిన్నికృష్ణ, వైసిపి మండల అధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి అయూబ్‌బాషా, కో-ఆప్షన్ మెంబర్ నాసర్, సచివాలయం కన్వీనర్ ఎస్ఎస్ ఫయాజ్, చాంద్‌బాషా, జీవి రామకృష్ణ, ప్రభుత్వ ఆస్పత్రి కమిటీ మెంబర్ కంచి కళ్యాణ్ కుమార్ రెడ్డి, సచివాలయ జెఎసి మండల కన్వీనర్ రెడ్డి హరి, నాయకలు పాల్గొన్నారు.

మహిళలకు మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

చెరువుముందరపల్లెలో పశు వైద్య శిబిరం

పశువులకు మందులు వేస్తున్న పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలోని అగ్రహారం పంచాయతీ చెరువు ముందరపల్లె(నల్లగొండ)లో మదనపల్లి లయన్స్ క్లబ్ , నిమ్మనపల్లి పశుసంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు స్థానిక పశుసంవ ర్ధక శాఖ అధికారి డాక్టర్ సాదు సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువు ముందరపల్లెలో ఇటీవల కలుషిత ఆహారం తిని రెండు పశువులు మృతి చెందాయని అన్నారు. పశుసంవర్ధక శాఖ ఉన్నతా ధికారులు గ్రామంలో పర్యటించి పశువుల మృతికి గల కారణాలను పరిశీ లించి పాడి రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. నిల్వచేసిన ఎండు గడ్డిలో తేమ అధికంగా ఉన్న కారణంగా గడ్డి కుళ్లిపోవడంతో ఆ గడ్డిని పశువులకు మేతగా అందించడం వలన పశువులలో అనారోగ్య సమస్యలు వచ్చినట్లు తెలిపారు. మదనపల్లి లయన్స్ క్లబ్ వారితో కలసి పశు వైద్య శిబిరాన్ని నిర్వహించి పశువులకు, దూడలకు మందులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. అనారోగ్య సమస్యలు, గర్భకోశ సమస్యలు ఉన్న పశువులకు వైద్యం అందించినట్లు తెలిపారు. దూడలకు నట్టల నివారణ మందులను తాపినట్లు పాడి రైతులకు పశుపోషణ మెలకువలు గురించి వివరించి, మిన రల్ మిక్సర్‌ను ఇచ్చామన్నారు. చుట్టలు చుట్టిన ఎండుగంటిని పశువులకు మేతగా వేసేటప్పుడు పూర్తిగా ఆరబెట్టి, ఎండబెట్టి అందులో తేమ శాతం లేదని నిర్ధారించుకుని పశువులకు మేతగా అందించాలన్నారు. కుళ్ళిన ఎండి గడ్డిని పశువులకు మేతగా ఇవ్వడం వలన వాటి జీర్ణాశయంలో అఫ్లోటాక్సిన్స్ వంటి విష పదార్థాలు ఏర్పడి పశువుల జీర్ణ వ్యవస్థను దెబ్బతీస్తాయని చెప్పారు. అన్నారు. పశువులు మేత తినకపోవడం, నీరు తాగకపోవడం, నీరసించి పోవడం, తద్వారా చనిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయని సూచించారు. పాడి రైతులు పశుసంవర్ధక శాఖ అధికారులు ఇచ్చిన సలహాలు సూచనలను తప్పక పాటించాలని తెలిపారు. పశు వైద్య శిబిరంలో 27 దూడలకు నట్టల నివారణ మందులు, 25 పశువులకు అనారోగ్య సమస్యలను, 28 పశువులకు గర్భకోశ సమస్యలను గుర్తించి తగిన వైద్యం అందించి, మందులను పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మదనపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు భాస్కరాచారి, జోనల్ చైర్మన్ మహేష్, రిటైర్డ్ ఎడి డాక్టర్ హసన్, స్థానిక పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్‌లో సత్తాచాటిన శివకోటి

ప్రజాశక్తి-నందలూరు

ట్రోఫీతో శివకోటి

స్థానిక నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ అరవపల్లె గ్రామా నికి చెందిన శివకోటి జాతీయస్థాయి వికలాంగ క్రికెట్ పోటీలలో విశేష ప్రతిభ కనబరచి నందలూరు కీర్తి ప్రతిష్టతలను మరోసారి పెంపొందించాడు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ రాజస్థాన్ రాష్ట్రంలోని అజ్మీర్‌లో జరిగిన 3వ మినీ నేషనల్ డిసేబుల్డ్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్ర రాష్ట్ర దివ్యాంగుల జట్టు రన్నరప్‌గా నిలిచిందని అన్నారు. ఫైనల్ మ్యాచ్లో రాజస్థాన్ జట్టు తో చివరి వరకు పోరాడి ఓటమి చెందామని తెలిపారు. ఈ టోర్నమెంట్ తన వైస్ కెప్టెన్సీతో అద్భుతమైన ప్రదర్శన కన బరిచి అటు బ్యాటింగ్ లోను ఇటు బౌలింగ్ లోను 90 పరు గులు చేయడంతో పాటు 9 వికెట్లు తీసుకున్నట్లు తెలిపారు. సెమీఫైనల్‌లో గుజరాత్ జట్టు పై విజయం సాధించి ఫైనల్‌కు చేరుకోవడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తులో కచ్చితంగా ఆంధ్ర రాష్ట్ర దివ్యాంగుల జట్టు తరపున ట్రోఫీ గెలుచు కుంటా మని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ దివ్యాంగ క్రికెట్ అసోసియేషన్ సెక్రెటరీ వసంత కుమార్ ఫైనల్ ముగిసిన వెంటనే తనను అభినందిస్తూ ప్రశంసా పత్రం అందించారని పేర్కొన్నారు. తనకు సహకరిం చిన కోచ్‌లకు, కెడిసిఎ, నందలూరు సబ్‌సెంటర్, ప్రజాప్రతి నిధు లకు, స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువుకు చెందిన కండక్టర్ తోట శ్రీధర్ తన తల్లి దండ్రులు తోట దామోదరం, తోటలక్ష్మీ దేవమ్మల జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేస్తారు. గురువారం మండల కేంద్రంలోని పిటిఎం రోడ్డులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షలలో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.10వేలు బహుమతులను, పాఠశాలకు విరాళంగా రూ.20వేలు విలువ చేసే ప్రింటర్‌ను అందించారు. శ్రీధర్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా పదవ తరగతిలో మండలంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు తన వంతుగా ప్రోత్సాహక బహుమతులను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, రిటైర్డ్ టీచర్ వరదాచార్యులు, పాఠశాల కమిటీ చైర్మన్ జయరాం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న కండక్టర్ శ్రీధర్

జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్‌లో జాప్యం చేయకండి


ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ తనిఖీ చేస్తున్న డిటి తిమ్మారెడ్డి

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రంలో 14 గ్రామాలలో ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఇంటి పట్టాలు పొందిన లబ్దిదారులు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఇన్‌ఛార్జి తహశీల్దార్ తిమ్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం సచివాలయం-1ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివీడులో మూడు సచివాలయాల్లో ఉన్న లేఅవుట్‌లో జగనన్న కాలనీలో ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్లు సకాలంలో పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గృహ లబ్దిదారులకు సమాచారం అందించి రిజిస్ట్రేషన్ చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వాలంటీర్లు తమ గృహాలకు సత్వరమే రిజిస్ట్రేషన్ చేయించుకునేలా తెలియజెప్పాలని డిటి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్‌కుమార్, విఆర్ఒ వెంకటేశ్వర్లు, అల్లా బకాష్, రెవిన్యు సిబ్బంది, చంద్రాయుడు, విజయ్ కుమార్, చీకటి సురేష్ కుమార్ పాల్గొన్నారు.

రన్నింగ్ రూమ్‌లో వసతులు మెరుగుపరచండి

- సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ పీడీ మిశ్రా

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు రైల్వే కేంద్రంలోని లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లకు వసతి కల్పించే రన్నింగ్ రూమ్‌లో సౌకర్యాలు మెరుగు పరచాలని సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ పిడి మిశ్రా సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక రైల్వే కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రన్నింగ్ రూమ్‌లో కేవలం 35 మంచాలు ఉండడం వల్ల రన్నింగ్ సిబ్బందికి ఇబ్బంది కలిగే అవకాశం ఉందని మరో పది పడకలు ఏర్పాటు కోసం గదులు నిర్మించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఉమ్మడి కడప జిల్లాలో ప్రసిద్ధిగాంచిన, చారిత్రక, నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహింపజేసి, ఆలయ చరిత్రను వివరించి, పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వెంట సీనియర్ డిఇఇ, టిఆర్‌డి సుదర్శన్ రెడ్డి, సీనియర్ డిఇఇ, టిఆర్ఎస్ఒ వీరయ్య, స్టేషన్ మేనేజర్ కమలాకర్, ఎస్ఎస్ఇటిఆర్‌డి.వినోద్ కుమార్, ఎలక్ట్రికల్ సెక్షన్ ఇంజినీర్ విజయ్ కుమార్, సిసి వేణుగోపాల్, సిఎల్ ఐ పెంచలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రన్నింగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న పీడీ మిశ్రా

'కేడర్ స్ట్రెంత్' సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ఆరోగ్య శాఖతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలలో 2014 వరకు అర్హత కలిగిన కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులర్ ప్రక్రియకు ప్రభుత్వం జిఒ విడుదల చేసింది. అయితే ఆరోగ్యశాఖలో రెగ్యులర్ కోసం డేటా అప్‌లోడ్ అవుతుంది. కేడర్ స్ట్రెంత్ క్లియర్‌గా ఉన్న వారికి మాత్రమే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ అతుంది. మిగతా వారికి కేడర్ స్ట్రెంత్ ఉన్నప్పటికీ సాంకేతిక కారణాలవల్ల అప్‌లోడ్ కావడం లేదని కాంట్రాక్టు ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. రామాపురం, నూలువీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కేడర్ స్ట్రెంత్ ఆన్‌లైన్‌లో చూపించడం లేదని చెబుతున్నారు. అర్హత పత్రాలు అప్‌లోడ్ చేయాలంటే ఆన్‌లైన్ తీసుకోవడం లేదని అంటున్నారు. 23 సంవత్సరాలు రెగ్యులర్ అవుతుందని ఆశ పడ్డామని సాంకేతిక కారణాలవల్ల ఆలస్యం అవుతుందని, ఎన్నికల కోడ్ వస్తే మరింత జాప్యం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని కాంట్రాక్టు ఉద్యోగుల కేడర్ స్ట్రెంత్‌ను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కొరముట్ల శ్రీనివాసులు

నేడు ఎంపీచే అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిచే శుక్రవారం అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేపట్టనున్నట్లు ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. గురువారం ప్రారంభోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆసరా నాల్గవ విడత వారోత్సవాలు, నూతన నిర్మించిన 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి, నూతన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ క్లినిక్ కేంద్రాలను ఎంపీ ప్రారంభిస్తారని తెలిపారు. కార్య క్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి, ఎంపిటిసి జనార్దన్‌రాజు, మందల నాగేంద్ర, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, పట్టణ కన్వీనర్ రమేష్ పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-బి.కొత్తకోట

భోజనం చేస్తున్న వృద్ధులు

స్థానిక పట్టణంలోని భారతీయ అంబేద్కర్ సేన మండల అధ్యక్షుడు పలక వెంకటేష్ తన కుమార్తె కృత్తిక, కుమారుడు హార్దిక్ పుట్టిన రోజు సందర్భంగా గురువారం వాయల్పాడు పట్టణంలోని శ్రీచౌడేశ్వరిదేవి వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ తన కుమార్తె,కుమారుడు జన్మదినాన్ని నిరాడంబరంగా జరుపుకొని, అందుకయ్యే ఖర్చుతో శ్రీచౌడేశ్వరి దేవి వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఒకపూట భోజనం ఏర్పాటు చేశామని తెలిపారు. పిల్లల్లో చిన్నప్పటి నుంచే సేవా దృక్పథాన్ని అలవరచుకునేలా చేయడం తల్లి దండ్రుల బాధ్యత అన్నారు. సమాజంలో అభాగ్యులను, నిరాదరణకు గురైన వారిని మానవతా దృక్పథంతో ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పలక వెంకటేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బాధితుడి కుటుంబ సభ్యులకు చెక్కును అందిస్తున్న సాయివికాస్‌రెడ్డి

బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆర్.ఉప్పరపల్లికి చెందిన కుంచెం సాయి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ అధినేత తనయుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి బాధితుడి కుటుంబానికి రూ.20వేలు ఆర్థిక సాయం అందించారు.కార్యక్రమంలో జనసేన నాయకుడు పసుపులేటి వెంకటరమణ, విజయ శేఖర్ రెడ్డి, నరసింహులు, ముక్కా వారి పల్లి సర్పంచ్ ఆరవ శ్రీధర్, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, విశ్వనాథ్, నారపరెడ్డి రాజారెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో మొక్కలు నాటుతున్న ఎన్‌సిసి విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-రామాపురం

పర్యావరణ పరిరక్షణకు మొక్కలను నాటి వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఎస్‌కెఎండి అఫ్రోజ్‌బేగం పేర్కొన్నారు. గురువారం పర్యావరణ పరిరక్షణపై ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ చెట్లు పెంచడం వల్ల పర్యావరణ పరిరక్షణకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెట్లు నాటడం వలన మానవుని మనగడకు ఎంతో ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు. ఈ చెట్ల వలన గాలి, నీడ, వర్షం రావడం వలన పంట పొలాలు పచ్చగా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్-ఎస్ కో-ఆర్డినేటర్ చిన్నారెడ్డిప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

7న మొల్ల సాహితీ జయంతి ఉత్సవాలు

కడప అర్బన్ : మొల్ల సాహితీ జయంతి ఉత్సవాలు మార్చి 7 నుంచి ప్రారంభమవుతాయని సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు, భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి జి.వి. మనోజ్ కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మొల్లమాంబ జన్మించి 700 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఆమె జయంతి ఉత్సవాలను జిల్లాలో ఏడు ప్రాంతాలలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శాలివాహన వంశాన ప్రభవించి, రామాయణాన్ని రచించి, సాహితీ లోకాన అజరామర కీర్తి నందిన కవయిత్రి మొల్ల జన్మస్థలి అయిన గోపవరంలో ప్రథమ జయంతి సభ మార్చి 7 నుంచి వరుసగా వారం రోజులపాటు జిల్లాలలో పలు ప్రాంతాలలో నిర్వహించి, ముగింపు ఉత్సవాన్ని 13వ తేదీన జిల్లా కేంద్రమైన కడపలో ఘనంగా చేయనున్నామని తెలిపారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

పట్టణ పరిధిలోని మాండవ్య నదిలో వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన వెలుగు చూసింది. స్థానిక ఎస్ఐ భక్తవత్సలం తెలిపిన వివరాల మేరకు.. గాలివీడు రింగ్ రోడ్డు నందిని గ్రాండ్ పక్కనే ఉన్న మాండవ్య నదిలో మృతదేహం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారని అన్నారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించినట్లు తెలిపారు. మృతుడు రాయచోటి పట్టణం బోస్‌నగర్‌కు చెందిన మహబూబ్‌బాషా(47)గా గుర్తించామని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తామని పేర్కొన్నారు.